''అలా సరదాగా షికారెళదాం రావోయ్''

అంటూ పిలిచిందో పిల్లగాలి.

''ఇప్పుడు షికారేవిటోయ్ ఎండవేళ''

బద్ధకంగా ఆవులించిందో సుడిగాలి.

''అయినా నువ్వు చెప్పినట్లు వినవోయ్. నీ ఇష్టం వచ్చినట్లు పరుగులు పెడితే కుదరదు. నే చెప్పినట్టు వింటేనే వస్తా'' అన్నది మళ్ళీ కాసేపు ఆలోచించి.

''అంతేలేవోయ్. మీ పెద్దాళ్ళంతా ఇంతే. అస్తమానం చిన్నవాళ్ళు చెప్పిన మాట, నచ్చినట్టు విని తీరాలనే శాసిస్తారు. నువ్వేమో నీ ఇష్టం వచ్చినట్టు చెలరేగి పోవచ్చు. మరి నేనేమో నీ అడుగు జాడల్లో నడవాలా'' నిష్టూరంగా అన్నది పిల్లగాలి.

''ఏవో అదంతా నాకు తెలియదు. అలా నీ కిష్టమయితేనే పోదాం. లేకపోతే హాయిగా పడుకొంటా. నిద్ద... రొస్తోం...ది.'' ఆవులించింది సుడిగాలి.

''అబ్బబ్బ ఏం బెదరిస్తారోయ్. సరే పా... వెళదాం... ఇదిగో నువ్వలా తొందరగా వెళ్ళిపోకు మరీ... నేను అలా చూసుకొంటూ వస్తా'' అన్నది పిల్లగాలి.

''అరెరే... ఏవిటా నిదానంగా రావడం. ఇక్కడ మనం తొందరగా పోవాలి'' హడావిడి పెట్టింది సుడిగాలి.

''ఏవుంది చెప్మా'' తొంగి చూచింది పిల్లగాలి.

ఎండ మండిపోతుంటే చెమటలు కార్చుకుంటూ రాళ్ళు బద్దలు చేస్తున్నారు కూలీలు. భగ్గున మండే ఎండలో రెండు కర్రముక్కలుపాతి వాటికి ఉయ్యాలలు కడితే అందులో మగ్గిపోతూ నిద్రపోతున్నారు పసివాళ్ళు. ఎవరి మొకాల్లోనూ చిరునవ్వు జాడలు లేవు. ఆనందం నీడలూ లేవు.

''పోనీ కాసేపు నెమ్మదిగా వీళ్ళ మీద మంచి నెళతానోయ్' సంబరపడింది పిల్లగాలి.

''అబ్బ చెపితే వినిపించుకోవూ! నువ్వు ఎంతసేపు సేద తీర్చినా వాళ్ళకి తెలియదు. అర్థం కాదు. అలా పనిలోనే వుండిపోతారు. కొండంతా లీజుకు తీసుకుని వాళ్ళకి కాంట్రాక్టు ఇస్తాడు కంట్రాక్టరు. ముందే సదీ ఇరవై అప్పులిచ్చేసి, నచ్చినట్టు తనిచ్చే కూలికి పని చేయించుకుంటాడు. వీళ్ళు ఇలా శవాల్లాగా పని చేయాల్సిందే. తప్పదు. పద పోదాం... రమ్మంటుంటే నీక్కాదూ...''

పిల్లగాలి వెనక్కు తిరిగి వస్తూ నడిచింది.

అప్పటికే సుడిగాలి రివ్వు మంటూ వెళ్ళిపోతోంది కళ్ళు మూసుకుని.

పిల్లగాలి నొచ్చుకుంది. ''పోనీ ఇక్కడైనా కాసేపు ఆగచ్చు కదా. పాపం ఎంత మంది కార్మికులు! కరెంటు కోతతో ఫ్యాక్టరీ మూసేశారు కాబోలు. పాపం ఫ్యాక్టరీ తెరవండని అరుస్తున్నారు. బుల్లి బుల్లి పిల్లల్ని ఎత్తుకుని ఎంతమంది తల్లులు! ముసలీ, ముతకా నోర్లు తెరుచుకుని ఎండలో మగ్గిపోతూ నిలబడి వున్నారు. వీళ్ళకి పాపం తిండెలాగో ఏమో! ఎంతమంది ఆకలితో చచ్చిపోతారో, బాబోయ్ అన్యాయంగా వుంది...''

పిల్లగాలి కాసేపు దిగాలుగా నిలబడి, అల్లంత దూరాన గబ గబా వెళ్ళిపోతున్న సుడిగాలిని చూచి, నాలుక కరుచుకుని పరుగు తీసింది.

''అబ్బా... ఏవోయ్... పోనీ ఇక్కడ కాసేపు ఆగుదావోయ్'' వెంటబడింది పిల్లగాలి.

''ఏం చూస్తావ్... హు... చూడు... చూసి ఏం చేస్తావ్... పోనీ చూడు... నాకైతే అలవాటై పోయిందనుకో.'' సుడిగాలి సెడ మొహం పెట్టి నిలబడింది.

పిల్లగాలి నెమ్మదిగా లోపలకు తొంగి చూచింది. ఆ జైలు కిటికీకి ఉరి పోసుకుని ఎత్తు తక్కువగా వుండడంతో నేల మీదకు కూలినట్లున్న ఇద్దరు ఖైదీలు కనిపించేరు. 'అంత తక్కువ ఎత్తున్న కిటికీకి ఎలా ఉరి పోసుకుని చచ్చిపోయారు చెప్మా' అని ఆశ్చర్యపడింది పిల్లగాలి.

''ఇంటరాగేట్ చేస్తుంటే పోయినట్లు రాస్తే ఎలా కుదుర్తుంది సార్! వీళ్ళు ఉరి పోసుకుని చచ్చారు. ఎస్. సర్. కేసంటే- దాని సంగతి నేనేం చెప్పలేనండి. రైతు సంఘం నాయకులు మీటింగు పెట్టుకొంటామని వచ్చారు. వద్దన్నాం సర్. జెండాలు పట్టుకుని ప్రదర్శన చేశారు సర్. వద్దన్నప్పుడు చెయ్యడం వాళ్ళకు అలవాటు సర్. ఏం చేస్తాం సార్. వాళ్ళ దగ్గర నిషేధించిన సాహిత్యం కట్టలున్నయ్ సర్... ఊ తప్పలేదు సర్. ఒ.కే. సర్. రిపోర్టు సిద్ధంగా వుంది. జైలుకి రావడం ఇది మొదటి సారి వాళ్ళకి. అవమానం భరించలేక ఉరి పోసుకున్నారు సర్. ఒ.కె. సర్. ఒ.కె.''

పిల్లగాలికి వణుకు పుట్టింది.

కిటికీకి వేలాడుతున్న శవాలను జాలిగా చూసింది. మొకం, కాళ్ళు, చేతులు గాయాలతో నిండిపోయి వున్నాయి. 'అబ్బ ఎంతలా కొట్టారో' పిల్లగాలి తేమ్మెర చనిపోయిన వాళ్ళను జాలిగా స్పృశించింది. రక్తంతో నిండిపోయి, జుత్తంతా మొహానికి అతుక్కుపోయి, పెదాలు బిగించి నిద్రపోతున్నట్లుగా వున్న ఆ కుర్రాడి బుగ్గను జాలిగా తాకింది పిల్లగాలి. ఆ గాలికి వాళ్ళ జుత్తు రెపరెపలాడింది. 'పాపం ఎంత ఓర్చుకున్నారో..'

''ఇక రావా...?'' కేకేసింది సుడిగాలి.

''అయ్యొయ్యో. తొందరగా రా... నువు రావాలి. ఇంక ఇటు వేపు... అబ్బ రావోయ్'' అంటూ గోల పెట్టింది సుడిగాలి.

''ఏమయిందీ.. ఇప్పుడు నాతో అంత పనేవిటి?'' నీరసంగా నడుస్తూ వస్తోంది చిరుగాలి.

''హమ్మో! ఎంత పని జరిగిందే, అయ్యొయ్యో ఎంత ఘోరం చేశారు. అదుగో వాళ్ళే కారెక్కి పోతున్నారు. ఒకళ్ళా. ఇద్దరా... ఆరుగురు. ఈ బంగళాలో మకాం వేశారు కాబోలు. పాపం... పిల్లను

# ప్రళయ వేళ




\- సి.సుజాత

